# బిచ్చగాళ్ళు లేకుండా చేయగ లేరా?

సాధారణంగా నడుస్తూనో, సిటీబస్సులోనో కనపడే సూర్యారావు హఠాత్తుగా మోటారు సైకిల్ తొక్కుతూ కనపడేసరికి ఆశ్చర్యం, ఆనందం కలిగి హలో అని చేయి వూపాను. అతను ఆపుతాడని అనుకోలేదు నేను. ఎందుకంటే—

వెనకటికి ఒకాయన్ను, రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఒకబ్బాయి పలకరించి టైమ్ ఎంత అయింది సార్ అని అడిగాట్ట. "నేను చెప్పనుగా" అన్నాట్ట ఆ పెద్దమనిషి. "అదేం సార్, టైం అడిగితే చెప్పినంత మాత్రాన ఏమయిపోతుంది?" అంటే; దానికి ఆయన చెప్పిన కారణం- టైం చెప్పాననుకో, నువ్వు అరెరే, ఆరుగంటల ప్యాసెంజరు తప్పిపోయిందే, ఇప్పుడు మా వూరికి వెళ్ళేదెలా? అని నువ్వంటావు పోనీ నాయనా, ఈ రాత్రికి నువ్వు మా యింట్లో భోంచేసి నిద్రపోయి ఉదయమే వెళ్ల అని నేను అనాలి. నువ్వు మా యింటికి వస్తావు. భోంచేసినప్పుడో ఆ తరవాతో మా అమ్మాయిని చూస్తావు. తనూ నిన్ను చూస్తుంది. ఉదయాన్నే లేచి మీ అమ్మాయీ, నేనూ ప్రేమించుకున్నాం మాకు పెళ్ళి చెయ్యండి అంటావు నువ్వు. నీది ఏ కులమో, నువ్వు ఎంతవరకు చదువుకున్నావో, ఉద్యోగం వుందో లేదో, మీ తల్లిదండ్రులు ఏటువంటివారో, ఇవన్నీ చూసుకోవలసిన బాధ్యత నామీద పడుతుంది. అంచేత ఎందుకొచ్చిన బాధ? నేను టైం చెప్పను?

అలాగ, నేను అతన్ని మోటార్ సైకిల్‌మీద లిఫ్టు యిమ్మని అడుగుతానని కాని అతను భయపడి, ఆపడనే అనుకున్నాను. ఆపాడు. తప్పనిసరిగా అతన్ని సమీపించాను.

"ఇన్నాళ్ళలో బండివాడి వయ్యావన్నమాట" అని పలకరించాను.

"అదేమిటి, అలా అంటావు ?" అన్నాడు సూర్యారావు.

"ఇల్లు కట్టుకున్నవాడు ఇంటివాడయినట్టు బండి కొనుక్కున్న వాడు బండివాడు కాదా ? అన్న ధోరణిలో అన్నాను" అని చెప్పాను.

"ఇంకా నయం. ఓరోరి బండివాడా, వోగిలమారి బండివాడా అని పాట పాడావు కాదు. సంతోషం" అన్నాడు సూర్యారావు.

"కొత్త బండిలా వుందే" అన్నాను....

"అవును. ఇంకా రిజిస్ట్రేషన్ కాలేదు సరే నువ్వు అన్నావు కనక చెబుతున్నాను. నేను త్వరలో ఇంటివాడిని కూడా అవుతున్నాను" అన్నాడు.

"చాలా సంతోషం. కొత్త ఇల్లు కొంటున్నావా, పాతదా ?" అన్నాను.

"స్థలం కొన్నాను. ఆఫీస్‌వాళ్ళు లోన్ ఇస్తారు, ఇల్లు కట్టాలి."

"అయితే రెండు రకాలుగానూ, నీ సిద్ధాంతానికి స్వస్తి చెప్పాలి" అన్నాను.

''అంటే ?''

"నువ్వు లంచాలూ, మామూళ్ళూ యివ్వవు. పుచ్చుకోవు - కదా నువ్వు బండివాడివి అయిన సందర్భంలోను, ఇంటివాడివి కాబోతున్న సందర్భంలోను ఆ నియమం వదలాల్సిందేగా" అన్నాను.

"అది ఎన్నటికీ జరిగే పనిగాదు" అని సూర్యారావు ఏక్సిలేటరు బిగించి కిక్కుకొట్టి బండి స్టార్ట్‌చేసి వెళ్ళాడు.

ఇది జరిగాక ఆర్నెల్లపాటు సూర్యారావు కనపడలేదు. ఆ తరువాత ఓనాడు వాళ్ళ ఆఫీసు ప్యూను మా ఆఫీసుకి ఏదో కవరు యివ్వడానికి వస్తే నేను పలకరించి అడిగాను. "మీ సూర్యారావుగారు బావున్నారా" అని; ఏ సూర్యారావు అని కాసేపు ఆలోచించి, "ఆయనా సార్ ? ఆయన-" అని వేళాకోళంగా నవ్వి, "ఆయనకి మతి స్తిమితం పోయింది సార్! మా ఆఫీసులో పనిలేదు. కంపల్సరీ రిటైర్‌మెంట్ ఇచ్చేశారు" అన్నాడు.

"అదేం ?" అన్నాను.

"అదేనండి మొదలు మోటారుసైకిల్ కొన్నారండి. దానికి రిజిస్ట్రేషన్ కోసం అదేదో ఆఫీసుకెళితే ఆళ్ళు రేపు రా, మాపు రా అని తిప్పారండి. చివరికి డ్రయివింగ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ ఇప్పించడానికి బ్రోకర్లుంటారని ఎవరో చెబితే వాళ్ళద్వారా ప్రయత్నం చేశారండి. రోడ్డు టాక్స్, లైసెన్స్ రిజిస్ట్రేషన్ ఫీజుకాక ఆళ్ళు అడిగింది యాభై రూపాయలెండి. అక్కడ తగువొచ్చిందండి, గవర్నమెంట్‌కి కట్టాల్సింది గాక పైసా ఇవ్వనన్నారండి ఈన. అంతేనండి పెనాల్టీలు పడ్డాయి, కోర్టుకి లాగారు. అంతేగాని లైసెన్సు రిజిస్ట్రేషన్ కాలేదండీ సరీగా సమయానికి యింటిస్థలంమీద బిల్డింగ్ కట్టడానికి వేసిన ప్లాను గురించి "ఆ ఆఫీసోళ్లు నాలుగువందలు అడిగారంటండి. ఈన ఇవ్వననీ ఒకటే గొడవండి. ఈ లోపులో ఎవరో బోధపరిచారండి. ప్లాను అప్రూవ్ చేయించుకోడానికి సిమెంట్‌కి ఇనుముకి అన్నింటికి ధరలు కాక సాదర్లుంటాయి అని జెప్పేసి, ససేమిరా ఇవ్వను గాక ఇవ్వనన్నారండి. ఇల్లు కట్టలేదని సైటుకిచ్చిన అడ్వాన్సు రికీవరీ పెట్టారండి. సైటు అమ్మేస్తే సరిపోయేది, ఆ కోపంలో మోటారుసైకిలు కూడా అమ్మేశారండి, అన్నీపోయి మతి చలించిందండి."

"పాపం సూర్యారావు మంచివాడు. బాగా మాట్లాడతాడు. ఆఫీసు కాగితాలు చక్కగా రాస్తాడు. అందరితో మంచిగా వుంటాడు—అతనికి ఎలాంటి కష్టం వచ్చింది" అనుకుని ఆ సాయంకాలం అతన్ని చూద్దామని వాళ్ళింటికి వెళ్ళాను.

* * *

సూర్యారావు వరండాలో నేలను కూర్చొని వున్నాడు. మతి చలించిందని అనడానికి ఆధారంలేదు. కాని నన్ను చూడగానే పాట లంకించుకున్నాడు.

"ధీమంతులు శ్రీమంతులు ఇందరున్నారే బిచ్చగాళ్ళు లేకుండా చేయలేరా ?" అని ఎప్పుడో విడుదలైన సినిమాపాట యిప్పుడు పాడుతున్నాడు.

"పిచ్చివాళ్ళు లేకుండా చేయగలేమా ?" అనిపించింది నాకు.

(1-12-79)